సాక్షి నంద్యాల

గురువారం । 8 । జూన్ । 2023



మహానందిలో భక్తజన సందడి

మహానంది: తెలుగు రాష్ట్రాల నుంచి బుధవారం మహానందికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి మహానందీశ్వరుడిని దర్శించుకున్నారు.



సాక్షిగణపతికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోక కల్యాణార్థం బుధవారం సాక్షిగణపతికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలావీరభద్రస్వామికి విశేషపూజలు నిర్వహించారు.



కేసీకి 104 క్యూసెక్కుల నీరు

గూడూరు: కర్నూలు నగర ప్రజల తాగు నీటి అవసరాల కోసం సుంకేసుల రిజర్వాయర్ నుంచి బుధవారం కేసీ కాల్వకు 104 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.

న్యూస్‌రీల్

నేడు అండర్-19 చెస్ పోటీలు ప్రారంభం

నంద్యాల(న్యూటౌన్): ఏపీ అండర్-19 చెస్ రాష్ట్రస్థాయి పోటీలు గురువారం ఉదయం ప్రారంభంకానున్నాయి. నంద్యాల పట్టణంలోని రామకృష్ణ పీజీ కళాశాల ఆడిటోరియంలో జరిగే ఈ పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, నంద్యాల జిల్లా సంఘం చైర్మన్ డాక్టర్ జి. రామకృష్ణారెడ్డి హాజరవుతారు. ఈ విషయాన్ని నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

సైన్స్ పరీక్షకు 1,052 మంది గైర్హాజరు

నంద్యాల(న్యూటౌన్): పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా బుధవారం నిర్వహించిన సైన్స్ పరీక్షకు జిల్లాలో 1052 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 47 పరీక్షా కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు 6,185 మంది విద్యార్థులకు గాను 5,133 మంది హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అనురాధ తెలిపారు. తాను 3 పరీక్ష కేంద్రాలను, స్క్వాడ్ టీమ్‌లు 12 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసినట్లు డీఈఓ వెల్లడించారు.

మెప్మా ఆధ్వర్యంలో ఆహా క్యాంటీన్

- నందికొట్కూరు ఆసుపత్రిలో ఏర్పాటు



రోగులకు ఆహార ప్యాకెట్లు అందిస్తున్న మెప్మా అధికారులు

నందికొట్కూరు: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘం సభ్యులు క్యాంటీన్ ఏర్పాటు చేశారు. ఆహా పేరుతో ఏర్పాటు చేసిన ఈ క్యాంటీన్ ద్వారా రోగులు, వారి సహాయకులకు తక్కువ ధరకే ఆహారం అందించనున్నారు. ప్రస్తుతం ఈ ఆసుపత్రి వద్ద ఎలాంటి క్యాంటీన్ లేకపోవడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి రోగులు, వారి సహాయకులు భోజన సమయంలో ఇబ్బంది పడుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని స్థానిక స్వయం సహాయక సంఘం సభ్యులు సరసమైన ధరకు వారికి ఆహారాన్ని ప్యాకెట్ల రూపంలో అందించేందుకు ముందుకు వచ్చినట్లు ఆసుపత్రి డాక్టర్ రాజశేఖర్, మెప్మా టీఎంసీ శాంతకుమారి తెలిపారు. బుధవారం వారు ఈ క్యాంటీన్ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ జక్కి, టీఎంసీ అర్బన్ వినయ్, లక్ష్మీదేవి, సీఓలు, టీఐఎఫ్, ఓబీలు పాల్గొన్నారు.

మద్దిలేటయ్యకు రూ. 9 లక్షల విరాళం



ఆలయ ఈఓకు విరాళం అందజేస్తున్న దాతలు

బేతంచెర్ల: మద్దిలేటి నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామానికి చెందిన పద్మశాలి గుర్రం వెంకటప్ప, గుర్రం రాందాసు వారసులు పద్మశాలి గుర్రం శ్యాం, మద్దిలేటి, రాజశేఖర్ రూ.9 లక్షలు విరాళమిచ్చారు. ఆలయ ఈఓ పాండురంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడులకు బుధవారం వారు ఆ మొత్తాన్ని అందజేశారు.

10న పార్ట్‌టైం టీచర్లకు డెమో

నంద్యాల(న్యూటౌన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని డా.బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో ఆంగ్ల మాధ్యమంలో పార్ట్‌టైం టీచర్ల నియామకానికి సంబంధించి అర్హులైన వారికి ఈ నెల 10న డెమో నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐ జిల్లా కో ఆర్డినేటర్ డా.ఐ శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే ఈ పోస్టులకు దరఖాస్తులను స్వీకరించడం జరిగిందని, అర్హులైన (టెట్, బీఎడ్, పీజీ/ సంబంధిత మెథడాలజీ) అభ్యర్థులకు డీసీఓ, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కర్నూలు దిన్నెదేవరపాడు డా.బీఆర్ అంబేద్కర్ గురుకులంలో ఉదయం 9 గంటల నుంచి డెమో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు శ్రీశైలానికి కేసీబీఓ సభ్యుల రాక

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం నీలం సంజీవరెడ్డి సాగర్ ప్రాజెక్టును కృష్ణా గోదావరి బేసిన్ ఆర్గనైజేషన్ సభ్యులు గురువారం సందర్శించనున్నట్లు డ్యాం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గంగాధర్‌రెడ్డి తెలిపారు. రుతుపవనాలు ఈయేడాది త్వరగా రానున్న దృష్ట్యా జలాశయ నిర్వహణను పరిశీలించేందుకు చీఫ్‌ఇంజనీర్ వీరేంద్రశర్మ తన బృందంతో వస్తున్నారు. డ్యాం గేట్లు, గేజింగ్, ఇంజినీర్లు, సాంకేతిక సిబ్బంది పనితీరులను పర్యవేక్షిస్తారు. అనంతరం కుడి, ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రాలను సందర్శిస్తారు.

వేతన జీవులకు భారీ ఊరట లభించింది. 11వ పీఆర్‌సీ బకాయిలను నాలుగు విడతల్లో చెల్లిస్తామని రాష్ట్ర కేబినెట్ హామీ ఇవ్వడంపై హర్షం వ్యక్తమవుతోంది. అలాగే 12వ పీఆర్‌సీ కమిటీ వేయాలని నిర్ణయం తీసుకోవడం ప్రభుత్వ ఉద్యోగుల్లో జోష్ నింపింది. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేసి గ్యారెంటీ పెన్షన్ స్కీమ్‌ను తీసుకురావడంతో ఉద్యోగుల కుటుంబాల్లో సంతోషం వెల్లివిరుస్తోంది. ఎన్నో ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేయడం.. జిల్లా కేంద్రాల్లో పని చేస్తున్న ఉద్యోగుల హెచ్‌ఆర్‌ఏను పెంచడం.. తదితర నిర్ణయాలతో వేడుకలు అంబరాన్ని అంటాయి.



కర్నూలులో గాంధీ విగ్రహం ఎదుట సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఉద్యోగులు

ఆనందమనిపించెన్

- సీపీఎస్ స్థానంలో గ్యారంటీ పెన్షన్ స్కీం అమలు
- కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ
- నాలుగు విడతల్లో 11వ పీఆర్‌సీ బకాయిలు చెల్లింపు
- 12వ పీఆర్‌సీ కమిటీని నియమించిన రాష్ట్ర ప్రభుత్వం
- కేబినెట్ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్న సీఎం వైఎస్ జగన్
- ఉమ్మడి జిల్లాలో 40 వేల మంది ఉద్యోగులకు మేలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నేతలు

నంద్యాల/కర్నూలు (సెంట్రల్) : ఉద్యోగుల విన్నపాలను రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంను రద్దు చేయడంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నేతలు అభినందనలు తెలుపుతున్నారు. ఉద్యోగులు, వారి కుటుంబాలకు ఏ మాత్రం మేలు చేయని ఈ పెన్షన్ స్కీంను రద్దు చేసి గ్యారంటీ పెన్షన్ స్కీం(జీపీఎస్)ను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. బుధవారం విజయవాడలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రి మండలిలో ఉద్యోగులకు అనుకూలంగా పలు నిర్ణయాలు తీసుకున్నారు. దీంతో ఉద్యోగ సంఘాల నాయకులు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంతో ఉమ్మడి జిల్లాలో దాదాపు 40 వేల మంది ఉద్యోగులకు మేలు జరగనుంది.

సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలోని కేబినెట్ చర్యలు తీసుకోవడంతో ఉద్యోగ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కర్నూలులోని కలెక్టరేట్ వద్ద ఏపీ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రఘుబాబు ఆధ్వర్యంలో 'సీఎం వైఎస్ జగన్ జిందాబాద్' అంటూ నినాదాలు చేశారు. అలాగే కలెక్టరేట్ ప్రాంగణంలో ఏపీఎన్‌జీఓ సంఘం నాయకులు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించినందుకు జిల్లా ప్రధాన కార్యదర్శి జవహర్‌లాల్ ఆధ్వర్యంలో సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగ సంఘాలు ప్రభుత్వానికి అన్ని రకాలుగా సహకారం అందిస్తాయని చెప్పారు.

జీపీఎస్‌తో ఎంతో మేలు

హామీ మేరకు సీపీఎస్(కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్)ను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రద్దు చేశారు. దాని స్థానంలో గ్యారంటీ పెన్షన్ స్కీం(జీపీఎస్)ను తీసుకొచ్చారు. సీపీఎస్ స్కీంలో పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ఎంత పెన్షన్ వస్తుందో తెలియదు. డీఏ ఎంత వస్తాయో స్పష్టత ఉండదు. ఈ క్రమంలో జీపీఎస్‌లో ఉద్యోగి పదవీ విరమణ పొందిన చివరి నెలలో తీసుకున్న జీతానికి కనీసం సగం పెన్షన్ కింద వస్తుంది. అలాగే డీఆర్‌ఏ కూడా రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగా పెరిగేందుకు అవకాశం ఉంటుంది.

రెండు పీఆర్‌సీలతో వైఎస్ జగన్ చరిత్ర

గతంలో ఏ ప్రభుత్వంలో రెండు పీఆర్‌సీలు ప్రకటించిన చరిత్ర లేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక చంద్రబాబునాయుడు పెండింగ్‌లో ఉంచిన 11వ పీఆర్‌సీని విడుదల చేశారు. ఉద్యోగులకు 27 శాతం మధ్యంతర భృతితో పాటు 23 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చి పెండింగ్ డీఏలు, హెచ్‌ఆర్‌ఏలు చెల్లించారు. ఇదే సమయంలో 12వ పీఆర్‌సీ కమిటీని కేబినెట్ సమావేశంలో వేయాలని సీఎం వైఎస్ జగన్ నిర్ణయం తీసుకున్నారు. త్వరలోనే కమిటీ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశమై రెండు, మూడు నెలల్లోనే నివేదిక ఇచ్చే అవకాశం ఉంది. ఫలితంగా కేవలం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే రెండు పీఆర్‌సీలు ఇచ్చిన చరిత్ర మిగిలిపోతుంది.అంతేకాక పెండింగ్‌లో ఉన్న 11వ పీఆర్‌సీ బకాయిలను విడుదల చేయాలని నిర్ణయించారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులకు బంఫర్ ఆఫర్

కాంట్రాక్ట్ ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నా వేతనాల్లో మాత్రం ఎంతో వ్యత్యాసం ఉంది. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న 10,117 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేశారు. 2014 జూన్ 5వ తేదీలోపు ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారందరి సర్వీసు రెగ్యులర్ అవుతుంది. ఈ నేపథ్యంలో కాంట్రాక్ట్ ఉద్యోగులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 2 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు రెగ్యులర్ అయ్యే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించి వారం, పది రోజుల్లో వివరాలను ప్రభుత్వం కలెక్టర్లకు పంపే అవకాశం ఉంది. కాగా.. ప్రభుత్వ శాఖల్లో తొలిసారి కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పనిచేస్తున్న వారిని 1993లో రెగ్యులర్ చేశారని, మళ్లీ సీఎం వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డే వారికి న్యాయం చేశారని ఉద్యోగ సంఘాల నాయకులు చెబుతున్నారు.



కర్నూలు కలెక్టరేట్‌లో ఏపీఎన్‌జీవో సంఘం నాయకుల సంబరాలు

ఉద్యోగుల కోసం కేబినెట్‌లో తీసుకున్న మరిన్ని నిర్ణయాలు...

- జిల్లా కేంద్రాల్లో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల హెచ్‌ఆర్‌ఏను 12 నుంచి 16 శాతానికి పెంచారు.
- వివిధ కార్పొరేషన్లు, యూనివర్సిటీలు, గురుకులాల్లో పనిచేసే ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా 60 నుంచి 62 ఏళ్లకు పెంచారు.
- మెడికల్ డిపార్టుమెంట్‌లో గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా జీతాలు తీసుకుంటున్న ఉద్యోగులకు 010 పద్దులో జీతాలు ఇచ్చేలా నిర్ణయం తీసుకున్నారు.

జీపీఎస్‌తో మేలు



సీపీఎస్ రద్దు చేసి జీపీఎస్ పెన్షన్ విధానం అమల్లోకి తీసుకుని రావాలని సీఎం నిర్ణయించడం అభినందించదగ్గ విషయం. ఏపీ ప్రభుత్వం తెచ్చిన జీపీఎస్ దేశానికే ఆదర్శమవుతుంది. ఈ విధానంలో ఉద్యోగులు రిటైర్ అయ్యాక జీతంలో 33 శాతం పెన్షన్ ఇస్తామని కేబినెట్‌లో చెప్పారు. – రాంపక్కిరెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు, నంద్యాల

జగన్ హయాంలోనే ఉద్యోగాలు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన వెంటనే సచివాలయ వ్యవస్థ ద్వారా లక్షకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశారు. చంద్రబాబు హయాంలో ఉద్యోగ నోటిఫికేషన్లు లేవు. నంద్యాలలో ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మించడంతో పాటు అందులో ఉద్యోగాల భర్తీకి కేబినెట్‌లో ఆమోదం తెలపడం ఆనందంగా ఉంది. – సమ్మద్, నిరుద్యోగి, నంద్యాల

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం



12వ పీఆర్సీ అమలుకు కమిటీ వేసేందుకు కేబినెట్ నిర్ణయం తీసుకోవడం శుభపరిణామం. కరోనా కష్ట కాలంలో సీఎం జగన్ 11వ పీఆర్సీ అమలు చేసి ఉద్యోగుల జీవితాల్లో ఆనందం నెలకొల్పారు. గత ప్రభుత్వంలోని ఉద్యోగుల బకాయిలను సైతం సీఎం జగనే చెల్లించారు. – జగన్‌మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయుడు, నంద్యాల

రుణపడి ఉంటాం



నేను బనగానపల్లె ఏరియా ఆసుపత్రిలో 15 సంవత్సరాలుగా కాంట్రాక్టు ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తున్నాను. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం మమ్మల్ని రెగ్యులర్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం. –ఫాతిమాబీ, కాంట్రాక్ట్ ఉద్యోగి, బనగానపల్లె

ఇక సీఎం జగన్‌ను మరువం



నేను 2008లో మెడికల్ అండ్ హెల్త్ డిపార్టుమెంట్ ఏపీహెచ్‌ఏ ఫీమేల్‌గా ఉద్యోగంలో చేరాను. అప్పటి నుంచి చాలీ చాలనీ జీతంతోనే పనిచేశాను. గతంలో రెగ్యులర్ చేయాలని ప్రభుత్వానికి విన్నవించాం. ఎవరూ పట్టించుకోలేదు. ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్ ఉద్యోగులను జగనన్న రెగ్యులర్ చేశారు. అందులో నేను ఉండడం సంతోషంగా ఉంది. జగనన్నకు జీవితాంతం గుర్తుపెట్టుకుంటాం. –ఎస్ శిరీష, ఎంపీహెచ్‌ఏ ఫీమేల్, కర్నూలు

ఎంతో సంతోషం



నేను మెడికల్ అండ్ హెల్త్ డిపార్టుమెంట్‌లో 2008 నుంచి పనిచేస్తున్నాను. జగనన్న సీఎం అయ్యాక మాకు ధైర్యం వచ్చింది. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులర్ జాబితాలో నా పేరు ఉంటుందని భావిస్తున్నాను. ఇది మా కుటుంబానికి ఎంతో సంతోషకరమైన వార్త. – వెంకటస్వామి, హెల్త్ అసిస్టెంట్, కర్నూలు

గతంలో పట్టించుకోలేదు



నేను 2005వ సంవత్సరం నుంచి బనగానపల్లె జూనియర్ కళాశాలలో ఇంగ్లిషు లెక్చరర్‌గా పనిచేస్తున్నాను. రూ.6500 వేతనంతో కాంట్రాక్టు ఉద్యోగిగా విధుల్లో చేరాను. గత ప్రభుత్వాలు రెగ్యులర్ చేస్తామని చెప్పి విస్మరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మమ్మల్ని గుర్తించి రెగ్యులర్ చేసినందుకు ఎంతో సంతోషం. –కిశోర్‌కుమార్, కాంట్రాక్ట్ లెక్చరర్, బనగానపల్లె.

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలకు చర్యలు

- వైద్యాధికారులకు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల: ప్రతి గర్భిణి ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవమయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్ నుంచి ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రసవాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలతో ఆరోగ్యశ్రీ ద్వారా వారికి లబ్ధి చేకూరడమే కాక ఆసుపత్రులకు ఆర్థిక వనరులు సమకూరే అవకాశం ఉందన్నారు. జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ఎక్స్‌రే యంత్రాలు పనిచేసేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. పనివేళల్లో వైద్యాధికారులు రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అలాగే ముఖ ఆధారిత హాజరు తప్పనిసరిగా వేయాలన్నారు. సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ జఫ్రుల్లా, వైద్యులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

- నంద్యాల ఆర్ఏఆర్ఎస్ అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఎన్‌సీ వెంకటేశ్వర్లు
- ఘనంగా మహానంది ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ కళాశాల డే
- ఐదుగురు విద్యార్థినులకు గోల్డ్‌మెడల్స్

మహానంది: వ్యవసాయ ఆధారిత మన దేశంలో వ్యవసాయ సంబంధ కోర్సులు చేసే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని నంద్యాల ఆర్ఏఆర్ఎస్ అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఎన్‌సీ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం రాత్రి మహానంది ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ కళాశాలలో కాలేజీ డే సంబరాలు జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఏడీఆర్ ఎన్‌సీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వ్యవసాయ విద్యను అభ్యసించే విద్యార్థులు రైతుల శ్రేయస్సుకు పాటుపడాలన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదువుతూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ నాయక్, స్టూడెంట్ ఆక్టివిటీస్ ఆఫీసర్ ఇన్‌చార్జ్ డాక్టర్ ఎం.సతీష్‌రాహుల్, డీఏఓ మోహన్‌రావు పాల్గొన్నారు.

ఐదుగురికి గోల్డ్‌మెడల్స్

మహానంది వ్యవసాయ కళాశాలలో చదువుతున్న ఐదుగురు విద్యార్థులకు యూనివర్సిటీ నుంచి గోల్డ్ మెడల్స్ వచ్చినట్లు ప్రిన్సిపాల్ కేఎస్ఎస్ నాయక్ తెలిపారు. బసిరెడ్డిగారి వైష్ణవి, కూరాకుల లక్ష్మీసంగీత, యలమారెడ్డి కిరణ్మయి, దుగ్గినేని స్నేహసాయిలకు శ్రీ సన్నపరెడ్డి కొండారెడ్డి, వీరమ్మ గోల్డ్‌మెడల్స్ అందించారు. అలాగే బసిరెడ్డిగారి వైష్ణవి, కూరాకుల లక్ష్మీసంగీత, దండె జ్యోత్స్న దుగ్గినేని స్నేహసాయిలు పి.వెంకటరెడ్డి, ఈశ్వరమ్మ గోల్డ్‌మెడల్స్ సాధించారన్నారు.



గోల్డ్‌మెడల్స్ సాధించిన విద్యార్థినులతో ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్, ప్రిన్సిపాల్

మొక్కజొన్నపై ఆసక్తి

- గతేడాది కలిసొచ్చిన సాగు
- వాతావరణం అనుకూలించి మంచి దిగుబడులు
- ఊరించిన గిట్టుబాటు ధర
- ఈ ఏడాది కోటి ఆశలతో సన్నద్ధం

కోవెలకుంట్ల: గతేడాది ఖరీఫ్‌లో గట్టెక్కిన మొక్కజొన్న రైతులు ఈ ఏడాది కూడా అదే పంట సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. విత్తన సమయంలో అదునుకు వర్షాలు కురియడం, వాతావరణం అనుకూలించి మంచి దిగుబడులు రావడంతో ఈ ఏడాది కోటి ఆశలు, రెట్టింపు ఉత్సాహంతో మొక్కజొన్న సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి సీజన్ ప్రారంభం కావడంతో మొక్కజొన్న పంట సాగుకు సరైన అదును కావడంతో విత్తన పనుల్లో నిమగ్నమయ్యారు. నంద్యాల జిల్లాలోని 29 మండలాల పరిధిలో మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం 39,035 హెక్టార్లు కాగా ఈ ఏడాది మరో ఐదు వేల హెక్టార్లు పెరిగే అవకాశం ఉన్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. సీజన్ ప్రారంభంలోనే మోస్తరు వర్షాలు కురుస్తుండటంతో సాగు విస్తీర్ణం పెరిగే ఆస్కారం ఉందని ఉన్నట్లు పేర్కొంటున్నారు. పంట కాలం 100 నుంచి 110 రోజులు కావడంతో రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఏటా ఒకే రకమైన పంట సాగు చేసి నష్టపోకుండా గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంట మార్పిడి విధానం అవలంభించి మొదటి పంటగా మొక్కజొన్న పంటను విస్తారంగా సాగు చేశారు. సేద్యాలు, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కోత, నూర్పిడి, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 15 వేలు వెచ్చించారు. వాతావరణం అనుకూలించి ఎకరాకు 28 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడులు లభించాయి. రైతులు చేపట్టిన పంటమార్పిడి విధానం సత్ఫలితాలను ఇవ్వడంతోనే ఆశించిన స్థాయిలో దిగుబడులు చేతికందాయి. మార్కెట్‌లో క్వింటా రూ. 2వేలు ధర పలకడంతో పెట్టుబడులు పోనూ రైతులకు నికర ఆదాయం చేకూరింది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి దిగుబడులను విక్రయించడంతో దళారుల బెడద నుంచి బయటపడ్డారు. గత ఏడాది మొక్కజొన్న సాగు రైతులకు అన్ని విధాలా కలిసి రావడం, ఈ ఏడాది ముందస్తు వర్షాలు అనుకూలంగా మారటంతో జిల్లాలో సాగు విస్తీర్ణం ఈ ఏడాది పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే విత్తనాలు, రసాయన ఎరువులు సిద్ధం చేసుకుని విత్తనానికి సమాయత్తమవుతున్నారు.



మొక్కజొన్న సాగుకు పొలాన్ని సిద్ధం చేసుకుంటున్న రైతు

రెండు ఎకరాల్లో సాగు చేస్తా



నాకున్న నాలుగు ఎకరాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రెండు ఎకరాల్లో మొక్కజొన్నపంట సాగు చేసేందుకు పొలాన్ని సిద్ధం చేసుకున్నాను. విత్తనాలు, రసాయన ఎరువులు అందుబాటులో ఉన్నాయి. ఈ ఏడాది పంట సాగుకు వాతావరణం అనుకూలంగా ఉంది. మరో వారం రోజుల్లో విత్తనం వేసేందుకు అన్నీ సమకూర్చుకున్నా. – వెంకటేశ్వర్లు, రైతు, జోళదరాశి, కోవెలకుంట్ల మండలం

గత ఏడాది మంచి దిగుబడులు



గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన మొక్కజొన్న పంటలో మంచి దిగుబడులు వచ్చాయి. రెండు ఎకరాల్లో పైరు సాగు చేయగా ఎకరాకు 28 క్వింటాళ్ల దిగుబడులు వచ్చాయి. మార్కెట్‌లో క్వింటా రూ. 2 వేలు ధర పలికింది. ఈ ఏడాది మూడు ఎకరాల్లో మొక్కజొన్న సాగుకు సమాయత్తమవుతున్నాను. – కుళాయప్ప, రైతు, అమడాల, కోవెలకుంట్ల మండలం

మొక్కజొన్న సాగుకు అదును



జూన్ 1వ తేదీ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. ఈ సీజన్‌లో మొక్కజొన్న పంట సాగుకు ఇదే సరైన అదును. సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్‌లో 453 హెక్టార్లలో సాగు సాధారణ విస్తీర్ణం కాగా వాతావరణం అనుకూలంగా ఉండటంతో సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉంది. – నిరంజన్, ఏఓ, కోవెలకుంట్ల

సబ్ డివిజన్ల వారీగా మొక్క జొన్న సాధారణ విస్తీర్ణం

సబ్ డివిజన్	సాగు లక్ష్యం (హెక్టార్లలో)
నందికొట్కూరు	15,633
ఆత్మకూరు	15,054
నంద్యాల	3,898
ఆళ్లగడ్డ	3,646
కోవెలకుంట్ల	433
డోన్	351

నేటి నుంచి మంత్రి బుగ్గన పర్యటన



డోన్ టౌన్: రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి నేటి(గురువారం) నుంచి ఐదురోజుల పాటు ఉమ్మడి కర్నూలు జిల్లాలో విస్తృతంగా పర్యటించనున్నారు. అధికార వర్గాలు తెలిపిన మేరకు ఆయన పర్యటన వివరాలు ఇలా..

- ఈ నెల 8 వ తేదీ (గురువారం) ఉదయం 10 గంటలకు బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం సమీపంలో వెలసిన శ్రీలక్ష్మీమద్దిలేటినరసింహస్వామి ధ్వజ స్తంభం ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొంటారు. 4.30గంటలకు బేతంచెర్ల పట్టణంలో కొత్తగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ప్రారంభిస్తారు.
- 9వ తేదీ ఉదయం డోన్ పట్టణం పేరంటాలమ్మ గుడి వద్ద ఉన్న వడ్డెర కమ్యూనిటీ హాల్‌లో జరిగే వడ్డెర్ల ఆత్మీయ సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం తన స్వగృహంలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తారు.
- 10న బనగానపల్లెలో జరిగే పార్టీకి సంబంధించిన కార్యక్రమంలో పాల్గొంటారు.
- 11 న డోన్‌లో రూ.3 కోట్లతో నిర్మించిన ఆర్ అండ్ బీ ఇన్‌స్పెక్షన్ బంగ్లాను ప్రారంభిస్తారు.
- 12వ తేదీ ఆదోని పట్టణంలో నూతనంగా నిర్మించిన సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు.

క్లుప్తంగా

అధిక విరేచనాలతో చిన్నారి మృతి


వైషల్య (ఫైల్)

కోసిగి: విరేచనాలు అధికం కావడంతో కోసిగి భీరప్ప గుడి సమీపంలో వైషల్య (1) అనే బాలిక మృతి చెందింది. తలారి అయ్యప్ప, సరసమ్మ దంపతుల నాల్గో కుమార్తె అయిన వైషల్యకు మంగళవారం విరేచనాలు ఎక్కువగా ఉండడంతో స్థానిక మెడికల్ షాపులో టాబ్లెట్స్ వేయించారు. అయినా తగ్గక పోగా బాలిక అపస్మారక స్థితికి చేరుకుంది. దీంతో రాత్రికి రాత్రే ఆదోనిలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా అక్కడ వైద్యులు పరీక్షించే అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న క్రేన్

● తప్పిన ప్రాణాపాయం


ఆర్‌టీసీ బస్సును ఢీకొన్న క్రేన్

కోడుమూరు: ఆర్టీసీ బస్సును వెనుక నుంచి భారీ క్రేన్ ఢీకొట్టింది. బస్సు వెనుక సీట్లలో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. కర్నూలు–2 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కర్నూలు నుంచి పత్తికొండకు వెళ్తుండగా బుధవారం కోడుమూరులోని కోట్ల సర్కిల్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. రోడ్డు కిరువైపులా హోటళ్ల ముందు వాహనాలు పార్కింగ్ చేయడంతో ఆర్‌టీసీ బస్సు డ్రైవర్, క్రేన్ డ్రైవర్ రోడ్డును సరిగా అంచనా వేసి డ్రైవింగ్ చేయకపోవడంతోనే ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు సమాచారం. ప్రమాదానికి కారణమైన క్రేన్ డ్రైవర్‌ను కోడుమూరు పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

వృద్ధుడి అనుమానాస్పద మృతి


మృతిచెందిన సుంకిరెడ్డి

పాణ్యం: మండల పరిధిలోని మద్దూరు గ్రామంలో ఓ వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మిడ్తూరు మండలం సుకేసుల గ్రామానికి చెందిన బొక్కెం సుంకిరెడ్డి (83) నలభై ఏళ్ల క్రితం మద్దూరు గ్రామానికి వచ్చారు. మృతుడికి వివాహం కాలేదు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి అన్నం పెట్టించుకుని కడుపునింపుకునేవారు. ఈ క్రమంలో మూడేళ్ల క్రితం కరెంట్ షార్ట్ సర్క్యూట్ కావడంతో కాలుకు గాయమైంది. అప్పటి నుంచి ప్రభుత్వం నెలనెలా ఇచ్చే పింఛన్‌తో కాలంవెల్లదీస్తూ నాలుగు రోడ్ల కూడలిలో అరుగుపై పడుకునేవారు. ఈ అరుగుకు పక్కనే అదే గ్రామానికి చెందిన గణపం లోకేశ్వరెడ్డి బంక్ ఉంది. ఇందులో 7 క్యాన్‌లలో 210 లీటర్ల డీజిల్ ఉంది. గుర్తు తెలియని దుండగులు బుధవారం తెల్లవారుజామున బంకుకు నిప్పు పెట్టి పూర్తిగా కాల్చి వేశారు. పక్కనే అరుగుపై నిద్రించే వృద్ధుడు కూడా చనిపోయి ఉన్నాడు. అతని తలకు తీవ్ర గాయమై రక్తపు మడుగులో పడి ఉన్నాడు. ఈ మేరకు స్థానికుల సమాచారంతో ఎస్‌ఐ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి దూర బంధువు ఈడుల కేశవరెడ్డి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

విత్తన ఎంపికే కీలకం

- ధ్రువీకరించిన విత్తనాలనే కొనుగోలు చేయాలి
- డీలర్ల నుంచి తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలి
- ఎమ్మిగనూరు ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి సూచనలు

కర్నూలు (అగ్రికల్చర్): ఖరీఫ్ సీజన్ మొదలైంది. అక్కడక్కడా వర్షాలు కూడా కురుస్తున్నాయి. రైతులు విత్తనం పనులకు సిద్ధం అవుతున్నారు. విత్తనాల కొనుగోలు, ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయశాఖ ఎమ్మిగనూరు సబ్ డివిజనల్ సహాయ సంచాలకులు మహమ్మద్‌ఖాద్రి (83310 57506) సూచిస్తున్నారు. దిగుబడులు విత్తన ఎంపికపై ఆధారపడి ఉంటాయని ఆయన పేర్కొన్నారు. వివరాలు ఆయన మాటల్లోనే..

- ధ్రువీకరించిన మేలు రకపు విత్తనాలను ప్రభుత్వ విత్తనాభివృద్ధి సంస్థల నుంచి గాని, పరిశోధనా కేంద్రాల నుంచి గాని, లైసెన్స్ కలిగిన డీలరు నుంచి గాని మాత్రమే కొనుగోలు చేయాలి.
- విత్తాలను కొనుగోలు చేసేటప్పుడు లాటు నంబర్, తేదీ, రకం మొదలైన వివరములు కలిగి సంతకం చేసిన బిల్లును విక్రయదారుల నుండి రైతులు విధిగా పొందాలి. కొనుగోలు చేసిన రకం కోత పూర్తి అయ్యేంత వరకు రైతులు ఈ బిల్లును జాగ్రత్తగా ఉంచుకోవాలి.



విత్తనాల నాణ్యతను పరిశీలిస్తున్న ఎమ్మిగనూరు ఏడీఏ మహమ్మద్ ఖాద్రి

- సంచిపై వేసిన గడువు తేదీ లోపల విత్తనాలను ఉపయోగించుకోవాలి.
- విత్తన సంచిపై సూచించిన విధంగా మొలక శాతం, నికర తూకం ఉన్నది లేనిది పరిక్షించుకోవాలి.
- పంట కాలం పూర్తయ్యే వరకు సంచిని జాగ్రత్త చేసుకోవడం అవసరం. ఏదైన సమస్య వచ్చినపుడు సంచి కూడా ఉపయోగపడుతుంది.
- సంకర విత్తానాన్ని (హైబ్రిడ్ విత్తనం) ప్రతి పంటకు విధిగా మార్చుకోవాలి. హైబ్రిడ్ విత్తనాలు ఒక పంటకు మాత్రమే ఉపయోగపడుతాయి.
- పత్తిలో నిషేధిత విత్తనాలను వాడొద్దు. అనుమతిలేని, పర్యావరణానికి హానికలింగించే హెచ్‌టీ పత్తి విత్తనాలను వాడరాదు.
- మేలు రకపు అధిక దిగుబడి నిచ్చే వంగడాల విత్తనాలను విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా కొని ఆ పంట ద్వారా అభివృద్ధి చేసిన విత్తనాలను రెండు మూడు సంవత్సరాల వరకు వాడుకోవచ్చు. తర్వాత తప్పని సరిగా విత్తనాలను మార్చుకోవాలి.
- వ్యవసాయంలో అధిగ దిగుబడులు సాధించాలంటే నాణ్యమైన విత్తనం అవసరం. తెగులు సోకని పంట నుంచి మంచి నాణ్యమైన దృఢమైన విత్తనాన్ని సేకరించి భద్రపరచుకోవాలి.
- రైతు సేకరించే విత్తనాలు బాగా మొలకెత్తే శక్తి కలిగి, రంగు, పరిమాణం, ఆకారాలలో ఒకే మాదిరిగా, దెబ్బతినకుండా ఉండాలి.
- కలుపుమొక్కల విత్తనాలు లేకుండా శుభ్రపరచి, తాలు,ఇతర వ్యర్థాలు లేకుండా విత్తనాలనుచెరిగి వాడాలి.
- తాలు గింజలు, పూర్తిగా తయారు కాని గింజలను తొలగించడానికి ముందు రెండు శాతం ఉప్పు ద్రావణంలో పోసి పైకి తేలిన వాటిని వేరుచేసి, మంచి నీటితో కడిగి ఆరబెట్టి ఉపయోగించాలి.
- బాగా ముదిరిన గింజలనే విత్తనాలుగా వాడాలి. అనధికరికంగా విక్రయించే విత్తనాలను కొనుగోలు చేయరాదు.లూజువిత్తనాలువాడటంమంచిది కాదు.
- అనుమతి లేకుండా అనధికారికంగా విత్తనాలు అమ్మే వారిపై నేరుగా ఏడీఏకు లేదంటే సంబంధిత వ్యవసాయాధికారికి ఫిర్యాదు చేయవచ్చు.

కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ ధరలు (క్వింటల్‌కు రూ.లలో)

పంట	కనిష్టం	గరిష్టం
వేరుశెనగ	4,662	7,862
పొద్దుతిరుగుడు	3,879	3,919
ఆముదం	5,140	5,210
మినుములు	3,570	7,001
ఎండుమిర్చి	6,009	17,629
కందులు	8,850	9,700
మొక్కజొన్న	1,219	1,749

బిల్లుల జారీలో పొరపాట్లకు తావివ్వొద్దు

కర్నూలు(రాజ్‌విహార్): బిల్లులు జారీలో ఎలాంటి పొరపాట్లుకు తావు ఇవ్వరాదని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం. ఉమాపతి అన్నారు. బుధవారం ఆయన స్థానిక విద్యుత్ భవన్ నుంచి కింది స్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్పాట్ బిల్లింగ్ ప్రక్రియను రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. బిల్లుల జారీలో సమస్యలు తలెత్తితే ఏఈలు పరిష్కరించాలని ఆదేశించారు.

అటవీ భూముల సంరక్షణకు చర్యలు

- జిల్లా స్థాయి అటవీ సంరక్షణ కమిటీ సమావేశంలో కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): అటవీ భూముల సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధ్యక్షతన జిల్లా స్థాయి అటవీ సంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా అటవీ భూములు ఆక్రమణకు గురైనట్లు తెలిస్తే తహసీల్దార్లతో కలసి సర్వే చేయించి స్వాధీన పరుచుకోవాలని డీఎఫ్‌ఓ శివ శంకర్‌రెడ్డిని ఆదేశించారు. కర్నూలు నగరానికి సంబంధించి గార్గేయపురం, విజయవనం(పుల్లయ్య పార్కు)లలో ప్రజలకు ఉపయోగపడేలా వాకింగ్ ట్రాక్, సైకిల్ ట్రాక్‌లను ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని సూచించారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

- ఆదోని, ఆలూరు, తుంగభద్ర తదితర ప్రాంతాల్లో జింకలు, కృష్ణ జింకలు రైతుల పొలాలను నాశనం చేస్తున్నాయని, వాటి సంరక్షణకు తుంగభద్ర సమీపంలో జింకల పార్కును ఏర్పాటు చేసేందుకు రూ.20 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు అటవీ శాఖ అధికారులు వివరించగా సంబంధిత అధికారలతో మాట్లాడి త్వరగా పనులను మొదలు పెట్టాలని ఆదేశించారు.
- అలాగే విజయవనంలో రూ.10 కోట్లతో పలు పనులకు ప్రతిపాదనలు పంపామని చెప్పగా తొందరగా మొదలు పెట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.
- ఆదోని–ఎమ్మిగనూరు మధ్య కోటేకల్లు బీటు దగ్గర కూడా రూ.2 కోట్లతో నగర వనం ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు.
- హైదరాబాద్‌లో పాలపిట్ట తరహాలో జిల్లాలో కూడా అటవీ శాఖ ఆధ్వర్యంలో చక్కటి పర్యాటక కేంద్రలను ఏర్పాటు చేయాలని, అవసరమైతే డీఎఫ్ఓ ఒకసారి పాలపిట్ట పర్యాటక కేంద్రాన్ని సందర్శించి తగిన ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో జేసీ ఎస్.మౌర్యారెడ్డి, డీఎఫ్ఓ శివశంకర్‌రెడ్డి, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, కర్నూలు ఆర్‌డీఓ హరిప్రసాద్, డీఎస్పీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

56 మంది సీనియర్ ఆడిటర్లు, ఏఏఓల బదిలీ

కర్నూలు(అగ్రికల్చర్): స్టేట్ ఆడిట్ విభాగం రాయలసీమ జోన్‌లో 56 మందిని బదిలీ చేస్తూ డైరెక్టరేట్ జాయింట్ డైరెక్టర్ బి.సత్యసాయి మోహన్‌సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీలలో భాగంగా కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి 16 మంది వరకు బదిలీ అయ్యారు. నిబంధనల ప్రకారం సీనియర్ ఆడిటర్లు, అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్లను రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ బదిలీ చేయాల్సి ఉంది. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఆర్‌డీడీ గోవిందప్ప 47 మందిని బదిలీ చేస్తూ ప్రొసీడింగ్ ఇచ్చారు. అయితే స్టేట్ ఆడిట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఆర్‌డీడీ జారీ చేసిన బదిలీ ఉత్తర్వులను పక్కన పెట్టి ఏకంగా 56 మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఐదేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న వారిని విధిగా బదిలీ చేయాల్సి ఉంది. రెండేళ్లకుపైగా పనిచేస్తుంచే రిక్వెస్ట్‌పై బదిలీ చేయవచ్చు. మార్గదర్శకాలకు విరుద్ధంగా బదిలీలు చేసినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆర్‌డీడీ ఉత్తర్వులను కాదని డైరెక్టరేట్ అధికారులు బదిలీలు చేపట్టడాన్ని ఏపీ ఎన్జీవో అసోసియేషన్, స్టేట్ ఆడిట్ ఉద్యోగ సంఘాల నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా.. డైరెక్టరేట్ అధికారులు 56 మంది సీనియర్ ఆడిటర్లు, అసిస్టెంటు ఆడిట్ అధికారులను బదిలీ చేస్తూ వ్యక్తిగతంగా ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం.

ముగ్గురు సీఐలకు స్థానచలనం

- బనగానపల్లెకు తిమ్మారెడ్డి
- కర్నూలు అర్బన్ తాలూకాకు శ్రీరామ్
- వీఆర్‌కు రామలింగమయ్య

కర్నూలు: జిల్లా పోలీసు శాఖలో ముగ్గురు సీఐలకు స్థానచలనం కలిగింది. కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్ ఇచ్చిన ప్రొసీడింగ్స్ మేరకు ఎస్పీ కృష్ణకాంత్ బుధవారం బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు. కర్నూలు ఒకటవ పట్టణ సీఐ ఎం.తిమ్మారెడ్డి బనగానపల్లెకు బదిలీ అయ్యారు. ఇక్కడున్న సీఐ సుబ్బరాయుడు బదిలీపై పొరుగు జిల్లాకు వెళ్లడంతో 45 రోజులుగా మల్లికార్జున గుప్త బనగానపల్లెకు సర్కిల్‌కు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణానికి చెందిన తిమ్మారెడ్డి 2007లో ఎస్‌ఐ హోదాలో పోలీసు శాఖలో చేరి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పనిచేశారు. 2021 మేలో సీఐగా పదోన్నతి పొంది కర్నూలు సీసీఎస్‌లో పనిచేస్తూ 2022 మార్చి 28న కర్నూలు వన్‌టౌన్‌కు నియమితులయ్యారు. దాదాపు 15 నెలల పాటు పనిచేసి బనగానపల్లె సర్కిల్‌కు బదిలీ అయ్యారు.


ఎం.తిమ్మారెడ్డి


కె.శ్రీరామ్

- అలాగే కర్నూలు అర్బన్ తాలూకా సీఐగా ఉన్న రామలింగమయ్యను వీఆర్‌కు బదిలీ చేసి వీఆర్‌లో ఉన్న కె.శ్రీరామ్‌ను తాలూకా సర్కిల్‌కు నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. 2007 బ్యాచ్‌కు చెందిన శ్రీరామ్ సర్వీస్ మొత్తం అనంతపురం, కడప జిల్లాల్లోని వివిధ విభాగాల్లో పనిచేశారు. 2018లో సీఐగా పదోన్నతి పొందారు. ఆదోని త్రీటౌన్ సీఐగా పనిచేస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఆయన వీఆర్‌కు వచ్చారు. తాజా బదిలీల్లో కర్నూలు అర్బన్ తాలూకా సీఐగా నియమితులయ్యారు.

12న స్కూళ్లు పునఃప్రారంభం

కర్నూలు సిటీ: జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు చెందిన స్కూళ్లు వేసవి సెలవుల అనంతరం ఈ నెల 12న పునఃప్రారంభం కానున్నట్లు డీఈఓ డాక్టర్ వి.రంగారెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు రాగి జావా ఇవ్వాలన్నారు. ఇందుకు అవసరమైన రాగి జావా పిండి, బెల్లం, బియ్యం, గుడ్లు, చిక్కీలు స్కూళ్ల పునఃప్రారంభం నాటికి సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

గ్రామీణ యువతకు ఫిట్టర్లుగా అవకాశం

- ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి

కర్నూలు(అగ్రికల్చర్): సూక్ష్మ సేద్య పరికరాలను రైతుల పొలాల్లో అమర్చేందుకు గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు శిక్షణ ఇస్తున్నట్లు ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి తెలిపారు. బుధవారం కర్నూలు ఉద్యాన భవన్‌లో ఫిట్టర్లుగా రాణించేందుకు పేర్లు నమోదు చేసుకున్న యువకులకు ప్రత్యేక శిక్షణ కార్యాక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏపీఎంఐపీ పీడీ మాట్లాడుతూ..ప్రస్తుతం 40 మందికి శిక్షణ ఇస్తున్నామని, ఆసక్తి కలిగిన మరికొంత మందిని కూడా తీసుకుంటామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు కలెక్టరేట్‌లోని ఏపీఎంఐపీ కార్యాలయం నంబర్లు 08518–279725, లేదా 79950 78264 ఫోన్ చేయాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో ఏపీఎంఐపీ అదనపు పీడీ రాజాకృష్ణారెడ్డి, ఎంఐ ఇంజినీర్లు హంపన్న, విజయ్, రంజిత్, ఎంఐడీసీ జయరామిరెడ్డి పాల్గొన్నారు.


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉమాదేవి

రీ సర్వే పకడ్బందీగా నిర్వహించండి


- వీడియో కాన్ఫరెన్స్‌లలో తహసీల్దార్లను ఆదేశించిన జేసీ ఎస్.మౌర్య

కర్నూలు(సెంట్రల్): రీసర్వేను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లను జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఆమె పలు ప్రాధాన్యత అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీసర్వేలో భాగంగా పీఎల్ ఆర్‌ను పూర్తి చేయాలన్నారు. భూమి లేని పేదలను గుర్తించాలని కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్సీ సామాజిక వర్గానికి సంబంధించి శ్మశాన వాటికలకు స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. పేదలకు ఇంటి స్థలాలు గుర్తించే ప్రక్రియను నిరంతరం కొనసాగించాలన్నారు. ప్రభుత్వ ప్రాజెక్టులకు సంబంధించి అవసరమైన భూసేకరణను ఎప్పటికప్పుడు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ ఎస్.వి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య

సుందర నగరంగా 'కందనవోలు'


గ్లోబ్‌ను ప్రారంభిస్తున్న మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కమిషనర్ భార్గవ్‌తేజ తదితరులు


కర్నూలు నగరంలోని గుత్తి పెట్రోల్ బంక్ సమీపంలో ఏర్పాటు చేసిన గ్లోబ్

కల్లూరు: కర్నూలును సుందరంగా తీర్చిదిద్దుతున్నామని మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కమిషనర్ ఎ.భార్గవ్ తేజ పేర్కొన్నారు. బుధవారం 27, 29వ వార్డుల పరిధిలోని గుత్తి పెట్రోల్‌బంకు కూడలిలో రూ.10 లక్షలతో నిర్మించిన నమూనా గ్లోబ్‌ను ప్రారంభించారు. అలాగే రూ.30 లక్షలతో జాతీయ రహదారి ఫ్లైఓవర్ కింద వెండర్, పార్కింగ్ జోన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. రాయలసీమ ముఖ ద్వారమైన కర్నూలును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. నగరంలో కూడళ్లు, డివైడర్లను సుందరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. బెస్ట్ సిటీగా కర్నూలును రూపుదిద్దాలన్నదే తమ ఏకైక లక్ష్యమని, అందుకనుగుణంగా అన్ని వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీ కాలువలు, పార్కులు, విద్యుత్ దీపాలతో పాటు సుందరీకరణ పనులను చురుగ్గా చేపడుతున్నామన్నారు. చిరు వ్యాపారుల కోసం ఫ్లైఓవర్ కింద మెండర్ నిర్మిస్తున్నామన్నారు.

అభివృద్ధితో పాటు ఆహ్లాదకరం

నగరంలో అన్ని వార్డుల అభివృద్ధితో పాటు ప్రజల ఆహ్లాదం కోసం పార్కులు, సర్కిల్‌లను సుందరంగా తీర్చిద్దుతున్నామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. దశాబ్దాలుగా అపరిష్కృతంగా మిగిలిపోయిన తాగునీటి సమస్యకు శాశ్వత పరి ష్కారం చూపామన్నారు. కమిషనర్ భార్గవ్ తేజ మాట్లాడుతూ ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించేలా నగర సుందరీకరణకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. డిప్యూటీ మేయర్ రేణుక, కార్పొరేటర్లు సుదర్శన్ రెడ్డి, అరుణ, పి.శారద, లక్ష్మీకాంతరెడ్డి, శ్రీనివాసులు, రాజేశ్వర్‌రెడ్డి, విక్రమసింహారెడ్డి, లక్ష్మిరెడ్డి, నారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, కృష్ణకాంత్‌రెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, ఎస్‌ఈ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో సమగ్ర శిక్ష సూపరింటెండెంట్

అదుపులో ఆదోని డిప్యూటీ డీఈఓ

- ఎయిడెడ్ స్కూల్ విషయంలో రూ.లక్ష లంచం డిమాండ్
- ఈనెల 2న అడ్వాన్స్‌గా రూ.50 వేలు అందజేత
- మధ్యవర్తిగా సమగ్ర శిక్ష సూపరింటెండెంట్

కర్నూలు(సిటీ): సమగ్ర శిక్ష సూపరింటెండెంట్ ఏసీబీ వలలో చిక్కారు. ఇదే కేసుకు సంబంధించి ఆదోని డిప్యూటీ డీఈఓను అదుపులోకి తీసుకున్నారు. వివరాలివీ.. ఆదోనిలోని ఓ ఎయిడెడ్ స్కూల్ కరస్పాండెంట్ మార్పు విషయంలో యాజమాన్యానికి అనుకూలంగా నివేదిక ఇచ్చేందుకు ఆదోని డిప్యూటీ డీఈఓ సుకుమార్ రూ.లక్ష , ఒక టీచర్ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అందులో కొంత నగదు బుధవారం రాత్రి జిల్లా విద్యాశాఖ కార్యాలయం పైభాగంలో ఉన్న సమగ్ర శిక్ష సూపరింటెండెంట్ కామరాజుకు ముట్టజెప్పేందుకు నైట్ వాచ్‌మన్‌కు పాఠశాల యాజమాన్యం నగదు అప్పగించారు. ఈ మొత్తాన్ని సూపరింటెండెంట్‌కు కార్యాలయంలో అప్పగిస్తున్న సమయంలో ఏసీబీ అధికారులు దాడి చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆదోనిలోని ఏబీఎం సంస్థకు చెందిన ఓ ఎయిడెడ్ స్కూల్ కరస్పాండెంట్ మార్పు విషయంపై యాజమాన్యం కోర్టుకు వెళ్లారు. ఈ విషయంలో కోర్టు విచారించి కరస్పాండెంట్‌ను మార్పు చేసేందుకు జిల్లా విద్యాశాఖ అధికారి రంగారెడ్డి, ఆదోని డిప్యూటీ డీఈఓ సుకుమార్‌తో పాటు ఓర్వకల్లు, గూడూరు ఎంఈఓల ఆధ్వర్యంలో త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ యాజమాన్యానికి అనుగుణంగా నివేదిక ఇవ్వాలంటే రూ.లక్ష , ఒక టీచర్ ఉద్యోగం ఇవ్వాలని ఆదోని డిప్యూటీ డీఈఓ ఆ స్కూల్ యాజమాన్యానికి సంబంధించిన ప్రతాప్‌కుమార్‌తో ఒప్పందం చేసుకున్నారు. ఇందులో భాగంగా ఈనెల 2న రూ.50 వేలు ఆదోని డిప్యూటీ డీఈఓకు అప్పగించారు. ఇదే విషయంపై ఆయన ఏసీబీ టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఏసీబీ అధికారులు దాడికి రంగం సిద్ధం చేశారు. సమగ్ర శిక్ష కార్యాలయం వద్ద ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం మిగిలిన రూ.50 వేలతో పాటు ఈ ఫైల్ విషయంలో మధ్యవర్తిగా వ్యవహరించిన సూపరింటెండెంట్ కామరాజుకు రూ.25 వేల మొత్తం సమగ్ర శిక్ష కార్యాలయ నైట్ వాచ్‌మెన్ రమేష్‌కు అప్పగించారు. ఆ నగదును అటెండర్ తీసుకుపోయి సూపరింటెండెంట్‌కు ఇచ్చి లెక్కిస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీరిద్దరినీ అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. ఆదోనిలో ఏసీబీ ఇన్‌స్పెక్టర్ కృష్ణయ్య డిప్యూటీ డీఈఓ సుకుమార్‌ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. దాడిలో తిరుపతి ఏసీబీ అడిషనల్ ఎస్పీ దేవకుమార్, ఇన్‌స్పెక్టర్లు తేజేశ్వరరావు, కృష్ణారెడ్డి, వంశీనాథ్, కృష్ణయ్య, ఇంతియాజ్‌లు పాల్గొన్నారు.


ఏసీబీ అధికారుల అదుపులో సూపరింటెండెంట్ కామరాజు, నైట్ వాచ్‌మన్ రమేష్